క్లుప్తంగా

నేడు మెగా రక్తదాన శిబిరాలు

కడప రూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం మెగా రక్తదాన దినోత్సవ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన దినోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలను కడపతో పాటు ప్రొద్దుటూరు. బద్వేలు, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఆలయాల హుండీ సొమ్ము లెక్కింపు


ఆలయ హుండీ సొమ్మును లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు, అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరంలోని దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు దేవాలయాల హుండీ సొమ్మును లెక్కించారు. నగరంలోని మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలోని హుండీల ద్వారా ఈ ఏడాది మార్చి నుంచి నేటి వరకు రూ. 12,780 సొమ్ము లభించిందని కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలోని హుండీ ద్వారా ఇదే కాలానికి రూ. 43,787లు లభించినట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్, దేవునికడప శివాలయం మాజీ చైర్మన్ పద్మాకర్, అర్చకులు శివసత్య కుమార్, ఎస్.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లకు సెలవులు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని ప్రైవేట్ టీచర్లకు సెలవులు ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని వారం రోజుల పాటు ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు సెలవులను ఇచ్చి ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వడం లేదన్నారు. పాఠశాలలకు రాకుంటే తొలగిస్తామని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

చింతకొమ్మదిన్నె : చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె జన భాగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లోని చిన్నారులను ఎక్కువ శాతం నమోదు చేసుకుని వారికి కావాల్సి ఆట సామగ్రి, పలు పుస్తకాలను ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. చిన్నారులకు ఆరు సంవత్సరాల నుంచి మంచి పౌష్టికాహారాన్ని అందించి మానసికంగా, శారీరకంగా ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్యాంపునకు కడప క్రీడాకారుడు

కడప స్పోర్ట్స్: హర్యాణా రాష్ట్రంలోని సోనీపేట్‌లో ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి గ్రాప్లింగ్ (రెజ్లింగ్) రెఫరీ క్యాంపునకు కడపకు చెందిన సీనియర్ క్రీడాకారుడు కె. గణేష్ ఎంపికయ్యారు. ప్రపంచ చాంపియన్‌గా మూడు సార్లు విజయం సాధించిన ఇస్లాం బాట్‌కేవ్ ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సురేంద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గణేష్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మానవత కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

కడప కల్చరల్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు 2023–24 సంవత్సరానికిగాను కడప నగర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహిస్తున్నామని నగర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సి.సుబ్బారెడ్డి తెలిపారు. నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యులు ఎంవీ రామచంద్రారెడ్డి, విశిష్ఠ అతిథులుగా కడప మున్సిపల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, కలెక్టర్ ఓఎస్‌డీ ఎస్.రఘునాథ్ హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

నగరంలో అభివృద్ధి పరుగులు

సంక్షేమ పరవళ్లు ఓ వైపు.. అభివృద్ధి పరుగులు మరోవైపు.. వెరసి వైఎస్సార్ సీపీ పాలనలో నగరం కొత్త రూపు సంతరించుకుంటోంది. నూతన నిర్మాణాలు.. రోడ్ల విస్తరణ పనులతో వడివడిగా అభివృద్ధి వైపు పయనిస్తోంది. ఇక అక్కాయపల్లెలో అభివృద్ధి రెండింతలై కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. రూ.50లక్షలతో నిర్మించిన హిందూ శ్మశాన వాటిక, రూ.2.34కోట్లతో నిర్మించిన ఉపరితల జలాశయం, రూ.5లక్షలతో నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లు, కోటి రూపాయలతో నిర్మించబోతున్న పార్కు, అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణ పనులు వంటివి అభివృద్ధికి అద్దం పడుతున్నాయి. అభివృద్ధి పనులను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, కమిషనర్ ప్రవీణ్‌చంద్ వీటిని ప్రారంభించారు. అభివృద్ధికి సహకరించిన ప్రజలకు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

–కడప కార్పొరేషన్


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు


అక్కాయపల్లెలో రూ. 5 లక్షలతో నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లు


పూర్తయిన ఉపరితల జలాశయం, (ఇక్కడే పార్కు నిర్మించనున్నారు)


రూ. 50 లక్షలతో నిర్మాణం చేసిన హిందూ శ్మశాన వాటిక

ప్రమాదకర కేబుల్ వైర్లను తొలగించాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ సూచించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 24వ డివిజన్ కో ఆపరేటివ్ కాలనీ, 27వ డివిజన్ గౌస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికి కాలువల్లో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఉన్నందున వాటిని తొలగించాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా స్వీకరించాలని, ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణ పనులను, ప్లాన్ అప్రూవల్స్‌ను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపై వ్యర్థాలు ఉంటే అక్కడి యాజమాన్యం వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. వార్డు సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

సరైన పింఛను ఎంపికకు ఉద్యోగికి అవకాశం ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగికి సరైన పింఛను పథకం ఏదో ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ కంటే జీపీఎస్ మెరుగైనదేమి కాదని దీనివల్ల ఉద్యోగులకు ఎటువంటి లాభం ఉండదని పేర్కొన్నారు. ఓపీఎస్ కన్నా జీపీఎస్ మేలంటునప్పుడు తనకు తగిన సీపీఎస్ పథకం ఎంపికకు ఉద్యోగికే అవకాశం ఇవ్వొచ్చుకదా అని పేర్కొన్నారు.

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు ప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలి


మాట్లాడుతున్న డీపీటీఓ గోపాల్ రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్ మంచి ప్రవర్తన, అలవాట్లను కలిగి ఉండి ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని డీపీటీఓ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కడప రీజియన్‌లోని ఆర్టీసీ డ్రైవర్లకు అత్యల్ప ఇంధన పొదుపు, ప్రమాద రహిత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో డీపీటీవో గోపాల్‌రెడ్డి ఇంధన పొదుపు, అడ్రస్ చేయుట తదితర వాటిపై అవగాహన కల్పించారు. అలాగే రహదారి నిబంధనలు పాటించడం, ఓవర్ టేక్‌లపై రోడ్డు డ్రైవర్స్‌లలో జాగ్రత్తలు, ఇంధన పొదుపు డ్రైవింగ్‌లో మెళకువల గురించి తెలియజేశారు. ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రౌడీషీటర్లకు, చెడు నడత కలిగిన వారికి ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీయిజంను సహించేదిలేదనీ, అక్రమార్గాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీషీట్లు ఉన్న వారు, చెడు నడత కలిగిన వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమాజంలో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ ఉండాలన్నారు. నేరాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

- కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ ఉలసయ్య తమ సిబ్బందితో కలిసి కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఐ యు.వై. జయరాముడు తమ సిబ్బందితో కలిసి కౌన్సెలింగ్ చేశారు. కడప రిమ్స్ పీఎస్ ఆవరణలో ఎస్‌ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి కౌన్సెలింగ్‌ను నిర్వహించారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న కడప తాలూకా సీఐ ఉలసయ్య

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీడాప్ సౌజన్యంతో జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల కాల వ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషనల్ సంస్థ రీజినల్ కో–ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సులలో శిక్షణతోపాటు అదనంగా బేసిక్ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పించడంతోపాటు ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 7103665112, 9059160549 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీనారాయణహోమం, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు శ్రీవారి కల్యాణం

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9:30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, సాయంత్రం గరుడ వాహనసేవ ఉంటుందని తెలిపారు.


హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

‘జన బాగిదారి’ని జయప్రదం చేయండి


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కేంద్ర ప్రభుత్వంచే ప్రారంభించబడిన ‘జన బాగిదారి’ కార్యక్రమాన్ని ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త జయప్రదం చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రెడ్డమ్మ, పద్మజ, దీప, రేణుక దేవి, నాగరత్న, మాబు చాన్, ఎస్.రేణుక, శ్రీవిద్య సూచించారు. మంగళవారం కడప నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో జన బాగీదారి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పలువురు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బ్రెయాన్ హాస్పిటల్ ప్రారంభం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో పోరుమామిళ్ళలోని మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బ్రెయాన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని వైద్యసేవలను గ్రామాలను విస్తరించాలన్న ఉద్దేశ్యంతో చిత్తా రవిప్రకాష్‌రెడ్డి నేతృత్వంలో కలసపాడులో మంగళవారం బ్రెయాన్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ హాస్పిటల్‌ను శాంతి ప్రేమ సేవా సమాజం చైర్మన్ చిత్తాబాలిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, చిత్తా గిరి ప్రణీత్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ హాస్పిటల్ సేవలు ప్రతి గ్రామంలోకి వెళ్ళాలన్న ఉద్దేశ్యంతో కలసపాడులో హాస్పిటల్ ప్రారంభించామన్నారు. ఇది విజయవంతమైతే ఇంకా ఎక్కువ హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. హాస్పిటల్‌లో స్పెషలిస్టు డాక్టర్లతో దంత, ఈఎన్‌టీ, కాన్పులు, ఫిజియో విభాగాల వారు ప్రతి నెల వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సగిలి సుదర్శన్, విశ్రాంత అధ్యాపకులు వీరస్వామి, ఓఎల్‌ఎఫ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరోగ్యరాణి, పోరుమామిళ్ల సెయింట్ ఆంటోనీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునందరెడ్డి, మేరీ ప్రజ్వాలా రెడ్డి, పోరుమామిళ్ళ జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, బోర్‌రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్రెయాన్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న చిత్తా బాలిరెడ్డి

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని 46వ డివిజన్‌కాలనీలోని విజయనగర్ కాలనీలో సీసీ రోడ్డును నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. మంగళవారం ఎస్టీయూ నాయకులు కంభం బాలగంగిరెడ్డి 46వ డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఎంపీ అవినాష్‌రెడ్డిని కోరారు. దీనికి స్పందించిన ఎంపీ 160 మీటర్ల సీసీ రోడ్డును ఎంపీ ల్యాండ్స్ కింద మంజూరు చేశారు. ఇందుకు 46వ డివిజన్ ప్రజలు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

- రిమ్స్ ప్రిన్సిపాల్ ఏ. సురేఖ

కడప అర్బన్: ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడేలా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఏ. సురేఖ అన్నారు. ప్రపంచ రక్తదాతల వారోత్సవాల సందర్భంగా మంగళవారం నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లోని ఐపీ విభాగంలో రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో లెక్చర్ గ్యాలరీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే రక్తదానం చేస్తే భవిష్యత్తులో సేవా గుణం అలవాటవుతుందన్నారు. కడప పురుషుల ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ తరపున విద్యార్థులు వచ్చి రక్తదానం చేయడం, రక్తదాతలుగా నమోదు చేసుకోవడం అభినందనీయమన్నారు. రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆరోగ్యవంతుడైన యువకుడు రక్తదానం చేసేందుకు అర్హులవుతారన్నారు. కడప రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, కడప ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి, అధ్యాపకులు పి. రవిశేఖర్, కె. శివరామ్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


రక్తదానం చేసిన వైద్య విద్యార్థులకు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అధికారులు

పవిత్ర హజ్ యాత్ర చేయడం అదృష్టం

కడప కల్చరల్ : పవిత్ర హజ్ చేయగల్గడం అదృష్టమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా తెలిపారు. మంగళవారం కడప నగరం కృష్ణా సర్కిల్‌లోని షాహి దర్బార్ సమావేశ మందిరంలో స్థానిక ట్రావెల్స్ అధినేత అస్మతుల్లా ఆధ్వర్యంలో పవిత్ర హజ్ యాత్రికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్ర చేస్తున్న వారంతా ఎంతో అదృష్టవంతులుగా భావించాలన్నారు. వారందరికీ దైవ కృప ఉండడంతోనే ఈ అవకాశాన్ని పొందగలుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హజ్ యాత్రలో పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి యాత్ర నిర్వాహకులు యాత్రికులకు తెలిపారు. అనంతరం వారికివ్యాక్సినేషన్ చేసి యాత్రకు అవసరమైన కిట్లతో కూడిన వస్తువులను అందజేశారు. గౌరవ అతిథులుగా కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ షేక్ ఇషాక్ అలీ, రాయచోటి సున్ని మసీదు ఇమామ్ షేక్ రషీద్ అహ్మద్, స్థానిక ముస్లిం ప్రముఖులు సయ్యద్ హిదాయతుల్లా తదతరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ప్రాజెక్టుల పూర్తి కోసం పోరాటాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పెండింగ్‌లో ఉన్న రాయలసీమ నీటి పారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం దశలవారీ పోరాటాలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలోని ప్రాజెక్టుల పూర్తి కోసం జూలై, ఆగస్టు మాసాల్లో పోరాటాలు చేపట్టనున్నట్లు వివరించారు. జులైలో పాదయాత్రలు, ఆగస్టు నెలలో రాయలసీమ సదస్సులు ఉంటాయని తెలిపారు. నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతున్న రాయలసీమలో గాలేరు–నగరి, తెలుగు గంగ, వెలుగోడు, కేసీ కెనాల్ దశాబ్దాలు గడుస్తున్న ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల పంట కాల్వలు పూర్తి కాక రైతులకు సకాలంలో నీరు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ, చంద్రశేఖర్, నాయకులు వీరశేఖర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వెల్లటూరు గ్రామ సచివాలయం పరిధిలోని వెల్లటూరు దళితవాడ, గోపులాపురం, రెడ్డిపల్లె, శవాస్కన్‌పల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేష్ రామాంజులరెడ్డితో కలసి ఆయన గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతన్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని సత్వరం వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే వెల్లటూరు దళితవాడలో సీసీరోడ్లు, విద్యుత్ లైన్లు, వీధిలైట్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌లైన్లు, వీదిలైట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హుత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుక వస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ మస్తాన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, హుస్సేన్, సుదర్శన్‌రెడ్డి, గురివిరెడ్డి, విశ్వం, బాలు, నాగార్జునరెడ్డి, ఈశ్వరయ్య, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కౌన్సిలర్ మునిరెడ్డి మృతి.. ఎమ్మెల్యే నివాళి

కమలాపురం : కమలాపురం మునిసిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మారుజోళ్ల మునిరెడ్డి (74) మృతి చెందారు. సోమవారం ఆయనకు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఉదయం మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మునిరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారని, ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. పార్టీ ఆవిర్భావం పార్టీ బలోపేతానికి కృషి చేసిన మునిరెడ్డి సేవలు ఎనలేనివని గుర్తు చేసుకున్నారు. మునిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే అన్నారు.

‘ఇంటాక్’ పరిసరాలు శుభ్రం

కడప కల్చరల్ : పాత కలెక్టరేట్‌లోని భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ప్రాంగణంలోగల దాదాపు 50 పాత మోటారు బైకులను అక్కడినుంచి తొలగించినందుకు సంస్థ జిల్లా చాప్టర్ ప్రతినిధులుస్థానిక పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కొద్దికాలంగా పాత కలెక్టరేట్‌లోని ఇంటాక్ (లైబ్రరీ) కార్యాలయ ప్రాంగణంలో పోలీసు కేసులో ఉన్న ద్విచక్ర వాహనాలను నిలిపి ఉంచారు. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. పూర్తి స్థాయిలో సభ్యుల సమావేశం నిర్వహించేందుకు అవకాశం లేకపోయింది. ఇటీవల నూతన కార్యవర్గం రావడంతో ప్రధాన సమస్యగా ఉన్న ఈ వాహనాలను అక్కడి నుంచి తొలగించాలని ప్రస్తుతం ఇంటాక చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి సభ్యులతో కలిసి కడప డీఎస్పీ, సీఐలకు విన్నవించారు. ఈ మేరకు వారు మంగళవారం ఉదయం తమ సిబ్బంది పర్యవేక్షణలో ఇంటాక్ కార్యాలయ ప్రాంగణంలోని ద్విచక్ర వాహనాలన్నింటినీ అక్కడి నుంచి తొలగించారు. తమ వినతి మేరకు పోలీసు అధికారులు స్పందించిన తీరుపై ఇంటాక్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.


ఇంటాక్ కార్యాలయ ప్రాంగణం నుంచి పాత వాహనాలను తీస్తున్న సిబ్బంది